

'వరల్డ్ సిండ్రోమ్ డే'పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో మంగళవారం వరల్డ్ సిండ్రోమ్ డేని ఘనంగా నిర్వహించారు. వెలుగు సిబ్బంది విజయకుమారి ఆధ్వర్యంలో వెలుగు కన్వీనర్ అర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనా కుమారిని పిల్లలు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. అనంతరం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది జన్యుపరమైన లోపమని, 18 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు గల బాలికలకు వివాహం చేయడం, 35 ఏళ్ళు పైబడిన మహిళలు గర్భం ధరించిన వారికి ఇటువంటి పిల్లలు పుడతారని వివరించారు. ఈ పిల్లలకు సానుభూతి కాకుండా శిక్షణ ఇచ్చి వారిని కూడా సమాజంలో కలుపుకోవాలని కోరారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు

ఎకరాకు రూ.50 వేలివ్వాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టం వాటిల్లిన పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని రైతు సంఘం కార్యాలయంలో బి.వెంకటరమణరెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ గ్రామాల్లో అరటి, బొప్పాయి, మదనపల్లి, తంబల్లపల్లి, రాయచోటి, సంబేపల్లి మండలాల్లో టమోటా, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల్లో మామిడి, పొద్దుతిరుగుడు, వరి వంటి పంటలు దాదాపు 20 వేల హెక్టార్లకు పైగా నష్టం వాటిల్లి రైతులు గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు. కనీస పర్యవేక్షణ చేసి పంట నష్ట తీవ్రతను ప్రభుత్వానికి నివేదికలు పంపలేదని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగపడలేదన్నారు. వ్యవసాయ ఉద్యాన వన అధికారుల తీరు మారాలని పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు నేడు అకాల వర్షానికి నష్టపోయినప్పుడూ రైతులకు చేయూతనిచ్చేలా గ్రామ గ్రామాన తిరిగి నష్టపోయిన రైతులను పెద్ద ఎత్తున సమీకరించి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగబసిరెడ్డి, ఈశ్వరయ్య, రెడ్డెయ్య, నాగేసు పాల్గొన్నారు.

రాగిజావ బలవర్ధక ఆహారం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు మరో పౌష్టికాహారం రాగి జావ అందించే కార్యక్రమం చాలా అద్భుతమైనదని కలెక్టర్ గిరీష తెలిపారు. జగనన్న గోరుముద్ద మరో పౌష్టికాహారం రాగిజావ అందించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి లాంఛనంగా ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఇఒ పురుషోత్తం, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో ఇప్పటికే సమూల మార్పులు చేపట్టి జగనన్న గోరుముద్ద ద్వారా రోజూ రుచికరమైన మెనూతో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు అందించి విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు వారానికి మూడు రోజులు బెల్లంతో కూడిన రాగిజావను అందించే మంచి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక మిగిలిన 3 రోజులు గోరుముద్దలో చిక్కీని పిల్లలకు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు విద్యార్థుల్లో సామర్థ్యం మెరుగుపరిచి, డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. తల్లులు తమ పిల్లలను బడికి పంపించేందుకు అవసరమైన ప్రోత్సాహాన్నివ్వడానికి ఉద్దేశించిన అమ్మఒడి దగ్గర నుంచి మొదలు పెడితే నాడు- నేడు ద్వారా స్కూళ్ల వ్యవస్థను మార్పు చేసే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. వీటితో పాటు పిల్లలకు విద్యాకానుక, గోరుముద్ద, బైలింగువల్ టెక్ట్స్‌బుక్స్, 8వతరగతి పిల్లలకు ట్యాబులు పంపిణీ వంటి అనేక విప్లవాత్మక కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. వీటన్నిటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు.


విద్యార్థులతో కలెక్టర్ గిరీష, జెసి తమీమ్ అన్సారీయా

అర్చకులకు ప్రశంస పత్రాలు

ప్రజాశక్తి - రాయచోటి

విశిష్ట సేవలకు గుర్తింపుగా అర్చకులకు కలెక్టర్ గిరీషా మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లాలోని ముగ్గురిని ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్ మాట్లాడుతూ శ్రీ శోభకృత్ నామసంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, విజయవాడ వారి సూచనల ప్రకారం జిల్లాలో విశిష్ట సేవలు అందించిన కురబలకోట శ్రీకోదండరామస్వామి ఆలయ పూజారి మల్లికార్జున, మదనపల్లి మండలం శ్రీనుమలు గంగమ్మ ఆలయ పూజారి బసినికొండ ఎం.వెంకట రమణ, పీలేరు మండలం శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానం అర్చకుడు పి.ఎస్.నరసింహన్‌కు ఒకొక్కరికి రూ.10,116 సంభావన, శాలువాతో సన్మానించి ప్రశంస పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారన్నారు. అనంతరం ఉగాది పర్వదినాన పురస్కరించుకొని అర్చకులు కలెక్టర్‌ను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్, రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి కార్యనిర్వహక అధికారి రమణారెడ్డి, ముఖ్య అర్చకులు చంద్రశేఖర్ స్వామి, అర్చకులు మల్లికార్జున్, లక్కిరెడ్డిపల్లి గంగమ్మ దేవస్థానం ఇఒ రాజు, పాల్గొన్నారు.


అర్చకులను సన్మానిస్తున్న కలెక్టర్ గిరీష

ఆశా వర్కర్ల ధర్నాను విజయవంతం చేయాలి : సిఐటియు


మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 24న అన్నమయ్య జిల్లా డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, సిఐటియూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యలు అధికమవుతున్నాయని చెప్పారు. వారి పనిభారంపై పెరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఆశావర్కర్లతో సంబంధం లేని పనులు చేయించ రాదని చెప్పారు. ఆశావర్కర్ల నియామకాలు ప్రభుత్వమే నిర్వహించాలని, వేధింపులు, అక్రమ తొలగింపులు, రాజకీయ జోక్యం ఆపాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ఆశావర్కర్ల నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయ విధులు, ఆశావర్కర్లతో చేయించరాదని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు సెలవులు మంజూరు చేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూపు ఇన్సురెన్సు కల్పించాలన్నారు. రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. 104 ఉద్యోగుల కోసం ఆశా వర్కర్లతో ఎలాంటి అదనపు ఖర్చులు చేయించరాదని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎ.ముంతాజ్ మాట్లాడుతూ ఆశాలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేని పేర్కొన్నారు. సచివాలయంతో సంబంధం లేకపోయినా సాయంత్రం వరకు సచివాలయంలో ఉండాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం 24న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా నాయకులు రమాదేవి, సత్యవాణి, సంగీత, రోజా, జహరాబి పాల్గొన్నారు.

అమర జవాన్ రాజశేఖర్ స్థూపం ఏర్పాటు


రాజశేఖర్ స్థూపం వద్ద నివాళర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జవాన్ దేవరింటి రాజశేఖర్‌కు గుర్తుగా స్మారక స్థూపం ఏర్పాటు చేశారు. మంగళవారం కలెక్టర్ గిరీష, ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇండో టిబేటన్ బార్డర్‌పై ప్రయాణిస్తున్న బస్సు లోయలో పడిన ఘటనలో అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలం, దేవపట్లకు చెందిన దేవరింటి రాజశేఖర్ (34) అనే ఆర్మీ జవాన్ మృతి చెందిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సంబేపల్లి మండలం, దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమర జవాన్ దేవరింటి రాజశేఖర్ గుర్తుగా స్మారక స్థూపం ఏర్పాటు చేశారు. స్థూపం వద్ద పలువురు నివాళులర్పించారు. సందర్భంగా కలెక్టర్ గిరీషా అమర జవాన్ దేవరింటి రాజశేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం చూపించిన భూమిలో వ్యవసాయ సాగు చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్మీ జవాన్ రాజశేఖర్ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కలెక్టర్‌తో పాటు ఐటీబిపి బెటాలియన్ కమాండెంట్ అమిత భాటియా, డిప్యూటీ కమాండెంట్ ఆయుష్ దీపక్, ఇంజినీర్ రంజాన్, సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, డిఎస్‌పి శ్రీధర్, సంబేపల్లి తహశీల్దార్ మహేశ్వర్ బాయ్, రూరల్ సిఐ లింగప్ప, ఎస్ఐ మహ్మద్ షరీఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి గోల్డ్ మెడల్


అఖిలకు మెడల్ ఇస్తున్న సినీనటుడు మనోజ్

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణానికి చెందిన పోలీస్ ఉద్యోగి వి. వెంకటేశ్వర్లు కుమార్తె వీరబల్లి అఖిల హీరో మంచు మనోజ్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌ను అందుకుంది. మంగళవారం తిరుపతి పట్టణంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఎంసిఎ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు గాను మోహన్‌బాబు యూనివర్సిటీలో వీరబల్లి అఖిలను గోల్డ్ మెడల్‌తో ఘనంగా సత్కరించినట్లు కుటుంబ సభ్యులు, సోదరుడు వినయ్ కుమార్ తెలిపారు.

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

రాయచోటి: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.పురుషోత్తం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం స్థానిక గఫారియా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యా శాఖాదికారి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను చేరాలంటే విద్యే సరైన మార్గమని చెప్పారు. పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులను కోరారు. విద్య, వినయం, క్రమశిక్షణ గల వారు జీవితంలో రాణిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు జాబిర్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ అస్మాఉర్దూ అకాడమీ మాజీ డైరక్టర్ అబ్దుల్ గఫార్ సాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'పోషన్ పఖ్వాడా'పై అవగాహన

రాజంపేట అర్బన్ : తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణే పోషన్ పఖ్వాడా ప్రధాన లక్ష్యమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిడిపిఒ నిర్మల సూపర్వైజర్లకు సూచించారు. మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయంలో ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ మూడవ తేదీ వరకు రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని పెనగలూరు, నందలూరు, రాజంపేట మండలాలలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. బ్లాక్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ హనుమంతు రమేష్ మాట్లాడుతూ పోషన్ పఖ్వాడా కార్యక్రమం ద్వారా ప్రజలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారం గురించి అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనీమియా దరిచేరకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, సచివాలయం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పారిశ్రామిక ప్రదర్శన విజయవంతం

రాయచోటి: ఎపి ఎస్‌సి ఇఆర్‌టి, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తోన్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంగళవారం డైట్ హైస్కూల్ జిల్లా స్థాయి ఎంఇడిపి ఎక్స్‌పో నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు వారి ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. గవర్నమెంట్ హైస్కూల్ డైట్ హెడ్ మాస్టర్ కె.శ్యామల కార్యక్రమాన్ని ప్రారంభించారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ శివ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్‌రెడ్డి ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. అవకాశాలను అన్వేషిస్తూ మంచి పరిశ్రమలను ఏర్పాటు చేసి గొప్ప పారిశ్రామిక వేత్తలుగా తయారు కావాలన్నారు. జీవన నైపుణ్యాలను పెంపొందించడానికిశిక్షణ సహాయపడుతుందని జిల్లా మేనేజర్ ఎన్.లక్ష్మీ నరసింహుడు వివరించారు. జిల్లా స్థాయి ప్రదర్శన నుంచి రాష్ట్ర స్థాయికి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి ఎపి మోడల్ స్కూల్ చెందిన విద్యార్థులు రూపొందంచిన 'రూమ్ హీటర్', కురబలకోట మండలంలోని అంబేద్కర్ గురుకులానికి చెందిన విద్యార్థుల రూపొందించిన 'స్నేక్ డిటెక్టర్ సెన్సార్' అనే ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. వీరికి జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీచర్ నారాయణరావు, కరుణాకర్, స్కూల్ కమిటీ చైర్మన్ బుజ్జి బాబు హాజరయ్యారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

రాజంపేట అర్బన్ : రాజంపేట ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని సిడిపిఒ పి.నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్త 3, సహాయకులు 6, మినీ అంగన్వాడీ కార్యకర్త 3 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు పదవ తరగతి పాసై 18 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు వయసు కలిగిన వారై, వివాహితై, స్థానికురాలుగా ఉండాలని పేర్కొన్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్త, సహాయకులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. తగిన అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోతే తదుపరి దిగువ తరగతులలో అత్యధిక అర్హత కలిగిన అభ్యర్థిని పరిగణలోనికి తీసుకుంటామన్నారు. అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులు సంబంధిత సర్టిఫికెట్లతో జిల్లా శిశు అభివృద్ధి పథక అధికారి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలు లోపల సమర్పించాలని తెలిపారు. పోస్టుల భర్తీ కొరకు అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తగిన అర్హతలు, వెయిటేజీని అనుసరించి మౌఖిక పరీక్ష ద్వారా ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



చిరుధాన్యాల వంటకాలను పరిశీలిస్తున్న సిడిపిఒ

చిరుధాన్యాల్లో పోషకాలు మెండు

ప్రజాశక్తి-రామాపురం

చిరుధాన్యాలతో చేసిన ఆహారంలో పోషకాలు మెండుగా ఉంటాయని, చిన్నారులకు పౌష్టికత ఇస్తుందని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వై.పద్మావతి అన్నారు. మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని సుద్దమల్ల పంచాయితీ ఎర్రంరెడ్డిగారిపల్లె లోని రైతుభరోసా కేంద్రంలో మంగళవారం పోషన్ పఖ్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత విలువైన పోషక పదార్థాలు చిరుధాన్యాలలో ఉంటాయని అన్నారు. ఆహారంలో ప్రతి ఒక్కరు ప్రతిరోజు తీసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి, ఊబకాయం తగ్గించవచ్చునని ఆమె అన్నారు. చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శనలలో ఉంచారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మజ, అరుణ కుమారి, క్లస్టర్ పరిధిలోని నీలకంఠరావుపేట, కసిరెడ్డిగారిపల్లి, గోపగుడిపల్లి, కల్పనాయిచెరువు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చిన్నమండెం :** చిన్నపిల్లల్లో చిరుధాన్యాలతో చేసిన ఆహారం పౌష్టికత ఇస్తుందని ఐసిడిఎస్ సూపర్ వైజర్లు శారద, పవనకుమారి అన్నారు. మండలంలోని కేసాపురం పంచాయతీ సచివాలయంలో పోషన్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారద, పవన కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక మండల పరిధిలోని గ్రామ సచివాలయాలలో మంగళవారం పోషన్‌పఖ్వాడాలో పోషకాహార మేళా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టిక ఆహారం తీసుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంఇఒ త్యాగరాజు, సిడిపిఒ నాగవేణిలు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్వేత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రమేష్‌కుమార్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గెలవడానికి నియోజవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రతి ఒక్కపట్ట భద్రున్ని కలసి ఎన్నికల్లో అఖండ మెజార్టీ రావడానికి కృషి చేసిన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డిని బేతలకాలని విద్యావంతులు పార్టీ కార్యాలయంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుల ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండ తమ ఓటును అభివృద్ధి చేసేవారికే ఓటు వేసి గెలిపించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మదన్ కుమార్, వెంకటరమణ, షేక్ అహమదుల్లా, సతీష్ కుమార్ రెడ్డి, షేక్ నాసిర్, షేక్ సలీమ్, శివరామ రాజు, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి హరి అమర్నాద్ రెడ్డి, సత్యరెడ్డి, సర్పంచ్‌పల్లె వాసు, మాజీ సర్పంచ్ లు జిలాన్ భాష ,బసయ్య , మహేంద్ర నాయుడు పాల్గొన్నారు.

27న విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎన్.బోటుమీదపల్లి గ్రామంలో గత 15 సంవత్సరముల క్రితం గుడిని మొదలుపెట్టి ఇప్పటికీ పూర్తి చేశారు. దేవాలయమును మూడు ఎకరాల స్థలంలో గ్రామంలోని 70 కుటుంబాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులందరూ కలసి రూ.2కోట్ల వ్యయంతో శ్రీకృష్ణ పరబ్రహ్మ దేవాలయం నిర్మించారు. 27న సోమవారం విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలో ఐదు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు కళానాట్యం కూచిపూడి, భరతనాట్యం, సత్య హరిచంద్ర నాటకం, కోలాటం, పండర భజన, చెక్కభజన,గోపూజ మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. వేద పండితులు మధ్య ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన, అర్చన సేవ, తోమాలసేవ నిర్వహిస్తారని చెప్పారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు



అన్నదానం చేస్తున్న శేషయ్య, సుజాత దంపతులు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధి అరవపల్లి లోని టంగుటూరి ప్రకాశం వీధిలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతాల సుజాత, భారతాల శేషయ్య యాదవ్ దంపతులు, వారి కుమార్తె పల్లవి , కుమారుడు సాత్విక్ దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్స్ డిప్యూటీ గవర్నర్ మన్నెం రామమోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణి యాదవ్ లు మాట్లాడుతూ మండలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ కార్యక్రమాలకు దాతలు సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్యామనబోయిన గురు ప్రసాద్, వాకర్స్ క్లబ్ సెక్రటరీ మోడపోతుల రాము, కానకుర్తి వెంకటయ్య, గాడి సునీల్ రెడ్డి, మేస్త్రి శంకర్, చామంచి పెంచలయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

'గోరుముద్ద'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



కలకడ : విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేస్తున్న ఎంపిపి

విద్యార్థుల ఎదుగుదలకు, ఎముకల పటుత్వానికి రాగి జావ అత్యుత్తమమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య ఆధ్వర్యంలో డిబిఎన్‌పల్లెలోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాగి జావ పంపిణీ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. వేసవిలో రాగి జావ అందించడం శ్రేయస్కరమని, ఇది పిల్లలకు పౌష్టికాహారంగా ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, రాజు, స్వర్ణలత, సరస్వతి పాల్గొన్నారు. **నందలూరు :** ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని అరవ పల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ మధు విద్యార్థులకు రాగి జావా అందించారు. వారానికి మూడు రోజులు చక్కీలు, మిగతా మూడు రోజులు రాగి జావా అందించడం జరుగుతుందని అన్నారు. **నిమ్మనపల్లి :** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులను తీసుకొస్తున్నాడని ఎంపిపి నరసింహులు అన్నారు. మంగళవారం బండ్లపై ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఇఒ రాజగోపాల్, సర్పంచు వెంకటరత్నతో కలసి జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మరో పౌష్టిక ఆహారం రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచులు, పాఠశాల హెచ్‌ఎంలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, వెంకటరత్న, చంద్రమోహన్, హెచ్‌ఎంలు జనార్ధన్, జయరాం రెడ్డి , ఏపీఒ రమేష్, నాయకులు నాగార్జున, పాఠశాల కమిటీ చైర్మన్ గంగరాజు, సిఆర్‌పి మంజుల, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కలకడ :** విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల నందు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు క్యాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉండాలన్న ఉద్దేశంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగి జావాను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు.ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఈ రాగి జావాను తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మునీంద్ర నాయక్, ప్రిన్సిపల్ మలంగ్ షావలి, స్కూల్ కమిటీ చైర్మన్ మస్తాన్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని పుల్లంపేట ఎస్‌బివిడి సభ హైస్కూల్, సంస్కృత ఉన్నత పాఠశాల, యుపి ఉన్నత పాఠశాలలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం చేపట్టిన రాగి మాల్ట్ ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, వైస్ ఎంపిపి భోగ పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, సామ రాంబాబు నూకల శ్రీహరి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రామాపురం :** పిల్లలకు పోషక విలువలను పెంచే రాగి జావా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఎంఇఒ రామకృష్ణుడు అన్నారు. మండలంలోని ఓబుల్‌రెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగి జావా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి. రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **గాలివీడు :** బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యన్రకమాన్ని వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు బలంగా ఉండేందుకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రెడేన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది సంబరాలు



రాజంపేట అర్బన్ : ఉగాది సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి-కలికిరి

చదువే వాండ్లపల్లి ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. కలికిరి క్రాస్ రోడ్ ఇందిరమ్మ కాలనీలో ఉన్న చదివేవాడ్లపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో తన సిబ్బంది పాఠశాలలో తెలుగు సాంప్రదాయ పద్ధతిలో మామిడి తోరణాలు కట్టి, వేపాకు, పూలు బెల్లంతో పచ్చడి తయారు చేసి సిబ్బందికీ, విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం పూజలు నిర్వహించి స్వీట్లు పెంచుకుని తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సంబరాలుఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ప్రకాష్, మంగమ్మ, ముబారక్, అరుంధతి, జయ చంద్ర, జగన్మోహన్, సబితా విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :** పట్టణ కేంద్రంలోని ఆర్‌ఎస్‌రోడ్డులో ఉన్నటువంటి శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగ ఉగాది అన్నారు. ఈ ఎవిద్యార్థులు చదువుతోపాటు తెలుగు పండగల యొక్క విశిష్టతను తెలుసుకోవాలన్నారు. ఈ ఏడాది కూడా ప్రకృతి అనుకూలించి, పంటలు బాగా పండాలని, ఆయురారోగ్యాలు సిద్ధించాలని, అభివృద్ధి పథాన పయనించాలని కోరారు. ఎటువంటి ఆపదలు రాకుండా, ఈ ఏడాది పొడవునా విజయం, అదృష్టం ప్రజల వెంటే ఉండాలని ఆకాంక్షించారు. చివరిగా ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్‌ఛార్జి కస్తూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాయచోటి:** పట్టణంలోని సుద్దలవాళ్ళ పల్లె శ్రీరాజు సిబిఎస్ స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలనుఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉగాది విశిష్టత, పండుగ ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేపై దాడి అమానుషం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



బి.కొత్తకోట : మాట్లాడుతున్న ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్

ఒక దళిత శాసనసభ్యుని పై నిండుసభలో దాడి చేయడం అమానుషమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. ఎమ్మెల్యే పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలలో ఓటమితో అధికార పార్టీకి పిచ్చి పరాకాష్టకు చేరి అధికారపక్ష ఎమ్మెల్యేలపై దాడికి దిగడం వైకాపా దౌర్జన్యకాండకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. దళిత ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామికి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొమ్మ శివ, మాజీ సర్పంచ్ గడికోట సుబ్బరాయుడు, పుల్లేల రమేష్, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు తేనెపల్లి చిన్న, హస్తి చంద్రరాజు, విజయ్, సుబ్రహ్మణ్యం, రామయ్య పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అధికార వైసిపి ఎమ్మెల్యేలు తమ తీరుతో ప్రజాస్వామ్యానికే కళంకం తీసుకొచ్చారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. టిడిపికి చెందిన దళిత ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై దాడి హేయనీయమైన చర్యని అన్నారు. టిడిపి సభ్యులు అసెంబ్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే మూకుమ్మడిగా వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు. స్పీకర్ చూసీచూడనట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు, రవికుమార్, ప్రభాకర్, పట్టా చంద్రమోహన్ రెడ్డి, మదార్ సాబ్ పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో మంచి దిగుబడులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మల్బరీ సాగులో మంచి దిగుబడులు పొందవచ్చని సెరికల్చర్ ఎడి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం పందిళ్లపల్లి పంచాయతీలోని సోములవాళ్లపల్లెకు చెందిన శివ అనే రైతు 15 ఎకరాలు మల్బరీ నర్సరీ, 15 ఎకరాలు మల్బరీ సాగును ఆయన పరిశీలించారు. గతంలో కన్నా ప్రస్తుతం పట్టుగూళ్ల కిలో ధర వెయ్యి వరకు పలుకుతోందని అన్నారు. ప్రతి రైతు కొద్దో గొప్ప నీళ్లు ఉన్నవారు మల్బరీ సాగు చేసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో షెడ్డు ఇతర పరికరాలు అందజేస్తుందన్నారు. మొక్క నుంచి పంట ఎదిగే వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎకరా మల్బరీ సాగు చేసుకున్న మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. శివ బిఎస్‌సి వరకు చదువుకొని 30 ఎకరాలలో మల్బరీ సాగు చేయడం గొప్ప విశేషమని ఎడి అభినందించారు. అంతేకాకుండా మండలంలో 20 మంది రైతుల చేత 20 ఎకరాలలో 30 లక్షల మల్బరీ మొక్కలను సాగు చేయిస్తున్నాడనీ ఆయన అన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసాయని, ప్రతి రైతు కనీసం ఎకరాలు మల్బరీ సాగు చేసుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ కవిత, మల్బరీ అధికారులు విశ్వనాధ్, సాహెబ్ పీర్, రైతులు మల్లికార్జున, పాల్గొన్నారు.

ఆత్మీయ సహకారం

గాలివీడు : ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడానికి ఆత్మీయ సహకారంలో భాగంగా మానవతా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పిల్లకూరి సునీల్ కుమార్‌కు వైద్య ఖర్చులు కోసం రూ.5వేలు అందజేసినట్లు మానవతా సంస్థ అధ్యక్షుడు సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. వెన్నుముక అరుగుదల, నరాల బలహీనులతో బాధపడుతున్న ఇతనికి ఆత్మ అతనికి వైద్య ఖర్చులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మానవతా సంస్థ కన్వీనర్ కణాల శివారెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, నరసింహులు, దామోదర, శశికుమార్, భాస్కర చెంగల్‌రాజు పాల్గొన్నారు.

ఇ-చలానాపై అవగాహన

కలికిరి : ఇ-చలానా పై గ్రామ మహిళ పోలీసులకు అవగాహన కార్యక్రమం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ లోకేష్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రోజువారి వాహనాల తనిఖీ కార్యక్రమంలో భాగంగా వాహనాలకు విధించిన అపరాధ రుసుం చలానాను చెల్లించని బాధిత వాహనదారులు సంబంధిత సచివాలయ లో చెల్లించాలని అన్నారు. అలా చెల్లించని యెడల మూడుసార్లు ఈ చలానా నమోదు అయి ఉంటే సంబంధిత వాహనం సీజ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ చలానా చెల్లించని వారి పేర్లు, ఫోన్ నంబర్‌లను గ్రామ మహిళ పోలీసులకు అందించి, వారి ఫోన్ నెంబర్లు ద్వారా వారికి సమాచారం అందజేసి త్వరితగతిన ఇ-చలానా చెల్లించే విధంగా చూడాలని వారికి సూచించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో 14 గ్రామ సచివాలయం మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

విభిన్న ప్రతిభావంతుడి భూములను దర్జాగా కబ్జా చేస్తున్న వారిపై కలెక్టర్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పిడబ్ల్యూడిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరామరాజు పేర్కొన్నారు. మంగళవారం మూడు రోడ్లకూడలిలో జిల్లా వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో 502/1,502/3 సర్వే నెంబర్లలో సుమారు మూడు ఎకరాల భూమి దశాబ్దాల తరబడి వారసత్వంగా ఉన్న విభిన్న ప్రతిభావంతుడి భూములను ఇతరుల పేర్లతో ఆన్‌లైన్‌లోనమోదు చేసుకున్నారని అన్నారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఏడేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కణతం చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం వికలాంగుల జెఎసిఅధ్యక్షులు మురళీధర్, మోహన్, నాగేశ్వర్, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి-చిట్వేలి

అంగన్వాడీ వర్కర్లు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులను విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్యని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సిఐటియు మండల అధ్యక్షులు కొత్త నాని అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. తమ గోడును ప్రభుత్వానికి వినిపించాలని విజయవాడకు వచ్చితే గృహనిర్బంధాలు చేయడం రైల్వే స్టేషన్ , బస్టాండ్‌లలో పోలీసులను పెట్టి అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గం అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికన్నా అధిక వేతనాన్ని ఇస్తామని చెప్పి అక్కడ రూ.14,600 ఇస్తుంటే, ఇక్కడ మాత్రం రూ.11,500 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. సక్రమంగా ప్రతినెల 5 తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు నాగయ్య, మహిళ నాయకులు నాగమణి, ఆటో యూనియన్ నాయకులు శంకరరెడ్డి, జ్యోతి నాగేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలో అర్హులందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సంక్షేమ, అభివృద్ధి అంశాలపై ఎంపిడిఒ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఒక్క పథకం లబ్ధిదారులకు అందేలా అధికారులు, సచివాలయ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా త్రాగునీరు, సాగునీరు, వైద్యం, విద్యుత్, జగనన్న హౌసింగ్ కాలనీలు తదితర అంశాలపై అధికారులు అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి భవాని, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రశాంతి రమేష్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, .జడ్‌పిటిసి రత్నమ్మ, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్‌భాష, తహాశీల్దార్ రామ్మోహన్, ఎంపిడిఒ నాగార్జున, సిఐ విశ్వనాథరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎస్ఐ రామ్మోహన్‌కు నగదును అందిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

విధి నిర్వహణలో ఎస్ఐ సేవలు భేష్ : ఎస్‌పి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

విధినిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్ఐ రామ్మోహన్ ముందంజలో ఉన్నారని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అభినందించారు. సోమవారం ఎస్ఐ సేవలను గుర్తించి ఎస్‌పి నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే విధినిర్వహణలో ఎస్.ఐ రామ్మోహన్ ముందున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా నేరాల నివారణ, నాటుసారా తయారీ, విక్రయాలు, కర్ణాటక మద్యం, రవాణా విక్రయాలను, నిర్మూలించడంలో సఫలీకృతులయ్యారని అన్నారు. ఈ నగదు బహుకరణ కార్యక్రమంలో డిఎస్‌పి కేశప్ప, సిఐ శివాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పోలీసుగా నగదు అందుకున్న ఎస్ఐని స్టేషన్ సిబ్బంది, ఎఎస్ఐ బొజ్జ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ నాయక్, నాగరాజ్ గౌడ్, రెడ్డప్పనాయక్, రామాంజులు, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, కావ్య, వెంకటరమణ, నరసింహులు, శేఖర్, నాగేంద్ర, విజయ్‌లు అభినందనలు తెలిపారు.

ఓఆర్ఎస్‌తో వడదెబ్బ నివారణ

పీలేరు : ఓఆర్ఎస్ ద్రావణంతో వడదెబ్బ నివారణ సాధ్యమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. పట్టణం కావలిపల్లి సచివాలయంలో వడదెబ్బ నివారణా చర్యలు అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలపై అవగాహన కలిగి నివారణా చర్యలు తీసుకోవాలని, లేదంటే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. అవసరమైతేనే తప్ప ఎండలో తిరగవద్దని, టోపి, గొడుగు సాధనాలు ఉపయోగిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్ఎం.లక్ష్మీ సిహెచ్ఒ సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

75 క్వింటాళ్ల అక్రమ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -చిట్వేలి



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన బియ్యం వాహనాలు

మండల పరిధిలోని చెర్లోపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల సమయంలో టియు 5898, ఏపీ 39 టియు 5286 నెంబర్ గల వాహనాలలో బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పజెప్పడం జరిగిందని ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. రెవెన్యూ శాఖ వారు వాహనాల్లో ఉన్న సుమారు167 బస్తాలు లోని 75 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకొని చెర్లోపల్లి చౌక దుకాణం వద్ద ఉంచడం జరిగిందన్నారు. ఈ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన రమేష్ శీను, కరిముల్లా ప్రసాద్ వారిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెండు చెక్‌పోస్టులు దాటుకొని అనుంపల్లి సమీపంలో ఘాట్ రోడ్లో బియ్యంతో వెళ్తున్న రెండు వాహనాలను విజిలెన్స్ అధికారులు ఘాట్ రోడ్లో పట్టుకొని వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపినట్లు సమాచారం.